వారము కామనియుఁ గావుననే మాకవిత యాచంద్రార్కము భాషకు సాహాయ్య మొనరింపఁగలదనియు మాచదువరులతో విన్నవించుకొనుచున్నారము.

పత్త్రికాధిపతులు.

# న్యాయచంద్రిక.

---

### ఆకాశముష్టిహనన న్యాయము.

ఆకసమును బిడికిళ్ళతోఁ బొడిచిన నేమియు ఫలములేదు. అట్లే ప్రతిపాద్యమగు విషయము లేకయే యుక్తులు సెప్పినఁ బ్రయోజనము లేదు.

### కూపయంత్రఘటికా న్యాయము.

నూతికమర్చిన యేతాముగడె ప్రమానొకప్పుడడుగంటును. వేఱొకప్పుడు మిన్ను ముట్టును. అట్లే జనుఁడు పర్యాయముగ హానివృద్ధులఁ జెందుచుండును.

### పంకప్రక్షాళన న్యాయము.

అడుసుఁ ద్రొక్కి పిదపఁ గాళ్ళుగడుగుకొనుటకన్న దూరముగాఁ దొలఁగి చనుట మంచిది. అట్లే ముందుగాఁ బాపకార్యమొనరించి తరువాతఁ బ్రాయశ్చిత్త మొనరించుకొనుటకన్న ముందే సన్మార్గమునఁ బ్రవర్తించుట శ్రేయము.

### పిష్టపేషణ న్యాయము.

పిండిని మఱల నూఱనక్కఱలేదు. అట్లే చెప్పినవిషయమును మఱలఁ జెప్పుట యనుచితము.

### ప్రధానమల్లనిబర్హణ న్యాయము.

పేరుగల జెట్టిని గెలిచినచోఁ దక్కిన మల్లులందఱు పరాజితులే యగుదురు. అట్లే ప్రధానమగు యుక్తిని ఖండింపఁ దక్కిన వాదములన్నియు నిరాకృతములే యగును.